తరతరాల కథ

శ్రీ గరికపాటి కృష్ణమూర్తి

జానకమ్మ కెవ్వున కేకవేసి కూర్చుంది. రాజశేఖరం కంగారుగా లేచాడు. లైటు వేశాడు. జానకమ్మకు ముచ్చెమటలు పోసినవి. కొంచెం వణకుతున్నట్లు కన్పించింది. ముఖంలో భయం గోచరిస్తుంది.

'ఏమిటి జానకీ? ఏమిటి?' కంగారుగా దగ్గర కెళ్లి అడిగాడు.

'ఏమీ లేదు లెండి. కంగారునుంచి కొంచెం తేరుకొన్నది. చెంగుతో ముఖం తుడుచు కొన్నది. కాని ముఖంలో ఆదుర్దా, బాధా భయాందోళనలు కన్పిస్తునే ఉన్నయ్.

'ఏమిటి జానకి? ఏమైంది?' మళ్లీ అడిగాడు.

'ఏమీ లేదండి...ఏమిటో పాడుకల వచ్చింది. రేపు అబ్బాయి దగ్గరకు పోదామండి.'

'ఓస్...ఇదేనా...పేద్ద కంగారు పెట్టేశావు పో' ఎంతో బరువు దింపిన వాడిలా అన్నాడు. మంచినీళ్లు తాగాడు. తీరిగ్గా సిగరెట్టు అంటించి 'ఇంతకీ ఏమిటేమిటి ఆ కల'? మంచంమీద పద్మాసీనుడై అడిగాడు.

జానకమ్మకు ఆయన వరసేమీ బాగాలేదు. తనకింకా గుండె దడ తగ్గలేదు. వణుకు వదల లేదు. ఆ పీడ కల బాపతు ఛాయలు పోలేదు. తన్ను ఓదార్చాల్సిందిపోయి మంచంమీద కూర్చుని చిదానందంగా అడుగుతున్నారు. ఏం మనిషమ్మా!

'ఏం? ఇంకా కంగారు వదల్లేదేమిటి?' మళ్లీ ప్రశ్న.

'పోతుంది లెండి' విది లించింది.

'అయినా కన్నకడుపుకోత మొగాళ్లకేం తెలుస్తుంది'?

'ఆ ఎత్తిపొడుపులకేం గాని కలలో అబ్బాయికేం జరిగిందేమిటి?'

ఈ ఊరడింపుకు కొంత శాంతిల్లింది.

'ఏమోనండి. రేపు యేది యేమైనా అబ్బాయిని చూడాలండి.'

'సరే వెళ్దాం'

'రాజశేఖరానికి జానకమ్మచేత ఎలా చెప్పించాలో తెల్సు.

'బిడ్డ ఎలా ఉన్నాడో యేమో!' మళ్లీ కొడుకు ఆలోచనలో పడింది.

కొడుకు వందమైళ్ల దూరంలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఒక్కగా నొక్క కొడుకు. ఎంతో గారాబంగా పెంచింది. పెద్దచదువు చదివాడు. చకచకా అన్నీ ప్యాసవుతూ వృద్ధిలోకి వచ్చాడు. చదువుతో బాటు వయస్సులోనూ పెద్దవాడయ్యాడు. కాని అంత వాడయినా 'అమ్మా అమ్మా' అంటూ చెంగు పట్టుకు తిరిగేవాడు. ఆఖరకి పిల్లని చూడటానికి వెళ్లినపుడు కూడ పిల్ల తనకి నచ్చినా' అమ్మా నీకు నచ్చితే నాకు నచ్చినట్లే నన్నాడు. వాడు మనసుపడ్డ పిల్లనే యిచ్చి వైభవంగా పెళ్లి జరిపించారు. పెళ్లయిన నెలరోజులకే ఉద్యోగమయింది. పెళ్లాన్ని తీసుకొని పట్నంలో కాపరం పెట్టాడు. కొత్త కాపరం గదాని తనుకూడ ఒక నెలరోజులుండి వచ్చింది.

'అయితే రేపు యే బండికి వెళ్దామంటావు?' నిశ్శబ్దాన్ని చీల్చాడు రాజశేఖరం.

'రేపు ఎక్స్ప్రెస్‌కి వెళ్దామండి. ఉదయం బండి అదేగా'

'ఇంతకీ ఏం జరిగింది.'

'ఏం జరిగిందేమిటండీ...అలా కన్నుమూశానో లేదో వాడు కళ్లు ముందున్నాడు. ఇంతలోకే ఊా పాడుకల వచ్చింది...నేనూ, అబ్బాయి కోడలు సినిమాకని బయలుదేరామట. అబ్బాయేమో రెండు రిక్షా

తెప్పిస్తా నన్నాడు. కోడలు పిల్లేమో, 'ఎందుకండి. హాలు దగ్గరే కదా! సరదాగా నడచిపోదామన్నది. మనవాడు సరే నన్నాడు.'

'ఊఁ!

'ఊఁ! ఏమిటండి. అసలు దానివలనే జరిగింది యిదంతా. ఏదో నా దగ్గర పొదుపు చేస్తున్నామని మెహర్బాణి పోవటం కోసమని సరదా అని వంక బెట్టింది. అయినా దాన్ననాల్సిన పనేముంది. మన వాడు గంగి గోవైపోయి సరే అన్నాడు. ఏమిటో పిచ్చాడైపోయాడు. అది ఎంత చెప్తే అంత' నిట్టూర్చింది.

ప్రభంజనం అటు తిరిగిపోతుందని పసిగట్టాడు రాజశేఖరం.

'అలా హాలువరకూ నడచి వెళ్లారన్నమాట.' అన్నాడు. 'అబ్బే...అలా కొంతదూరం నడిచామా... కోడలు పిల్ల అలా వాడి వెనకాల నడవాల్సింది పోయి వాడిప్రక్కప్రక్కన నడవటం మొదలెట్టింది. ఇంతలోకే ఎదురుగుండా ఒక మోటారు సైకిలు రయ్ మంటూ వస్తుంది. దాన్ని తప్పుకొంటానికి యీావిడగారు యింకోవైపుకు వెళ్లింది. ఇంతలోకే వెనుక నుండి మరో కారు రయ్‌మంటూ వచ్చేస్తుంది. ఆవిడగారు కారుమోత విన్పించుకో లేదులా ఉన్నది. ప్రమాదం వెంట్రుక వాసిలో తప్పిపోయింది. బిడ్డ యివతల ఫుట్‌పాదున్న వాడు ఒక్క ఉదుటున పరుగెత్తికెళి దానిని ఆవతల తోశేశాడు...కాని...కాని... బిడ్డ...బిడ్డకి...'వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టింది... రాజశేఖరానికి కూడ వెధవ పీడకల అన్పించింది.

'ఊరుకోవే పిచ్చిదానా! కలకే అలా అదిరిపోతావేమిటి?' ధైర్యం చెప్పాడు. అయినా పెద్దదానివి ఉన్నావు గదా! కోడలిని కాస్త దారి చూచుకొని నడవమని చెప్పొదూ' మందలించాడు.

జానకమ్మ మనస్సును మళ్లించటం మినహా గత్యంతరం కన్పించ లేదు.

ఈ కాలపు పిల్లలకు ఎవరు చెప్తారండి. అయినా ఎన కోడలు చాలా మంచిది మంచిదంటారుగా. మెత్తని పులండి. పైకి కన్పించదు. రాత్రి పూట ఏమోమో చెపుతూ ఉంటుంది వాడికి.'

'అంత గడుసు పిల్లా!' ఆశ్చర్యం కనపరచాడు.

'ఆఁ! గడుసుదే...తర్వాత బిడ్డని హాస్పిటలకు తీసుకు పోయేటపుడు, అత్తయ్యా! మీారు యింకో రిక్షాలో రండి. నేను ఆయన్ని పట్టుకొని యీా రిక్షాలో తీసుకొస్తానని మాట వరసకైనా అన్న దాండి...లేదు.'

ఒక వేళ కోడలు అడిగితే నువ్వు యింకో రిక్షాలో వెళ్లేదానివేనా?'

'నేనెందు కెళ్తాను. ఒకవైపు బిడ్డకు అలా రక్తం కారిపోతుంటే'

నవ్వును పెదాలవరకే పరిమితంచేసి 'అయితే అబ్బాయిని హాస్పటల్లో చేర్పించారన్నమాట' అన్నాడు.

'లేదు.'

'అదేమిటి?' ఆశ్చర్యంగా అడిగాడు.

'ఇంకా హాస్పటల్లో కూడా బాధ పడమన్నారా బిడ్డని. ఇంతలోకే మెలుకువ వచ్చింది. వెధవ కల. పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో యేమో?' నిట్టూర్చింది జానకమ్మ.

'ఏమైనా పిల్లల వెంట పెద్ద దిక్కు ఉండటం చాల మంచిది.'

ఈ మాటలు జానకమ్మను కొంత ఊరట కల్గించినవి.

'ఇటువంటి కలలు నీకు యెప్పుడూ వచ్చేవి కావుగా. ఎప్పుడూ అబ్బాయి పెళ్లనో, పెళ్లి చూపులనో చెప్పేదానివి.

'అప్పుడు అటువంటివే వచ్చేయండి. ఏదీ యీా మధ్యనే యీా పెళ్లయిన దగ్గరనుండి యిటువంటి యాక్సిడెంట్ కలలు తగులుడుతున్నయ్.

పెళ్లి—యాక్సిడెంట్.

బిడ్డ - కోడలు.

తల్లీ—ప్రేమ—ఈ మాటలకు వేరే అర్థాలు స్ఫురించినయ్ రాజశేఖరానికి.

తనకు పెళ్లయి యిరవై ఆరేండ్లు. తనకు ఒక్క కొడుకు లాగానే తన తలి దండ్రులకూ తనూ ఒక్కడే. చిన్నప్పుడే తండ్రి పోయాడు. తల్లే తండ్రి గురువై పెంచింది. ఇంటిపాటున ఉండి వ్యవసాయం చేసుకోవటానికి

పిత్రార్జితం చాలినంత ఉన్నది. తన యిరవై నాలుగో యేట జానకితో పెళ్ళయింది. జానకి చాలా అందంగా ఉండేది. అమ్మకూడ అందాల రాసైన కోడలు వచ్చిందని మురిసి పోయింది. యదార్థం చెప్పాలంటే జానకి అందానికి దాసుడై పోవటమే కాకుండ చూపే ప్రేమానురాగాలకు ముగ్ధుడై పోయాడు. ఎంతో అదృష్టవంతుడనని మురిసి పోయాడు. తనకు ఒకసారి జ్వరంవచ్చి వారం రోజులు లంఖణం చేస్తే ఎంత కంగారు పడిందో! ఎంత ఆదుర్దా చెందిందో! నిద్రాహారాలు మాని రాత్రింబవళ్లు సేవ చేసింది. తను మామూలు మనిషైన తర్వాత తిరుపతి ప్రయాణం పెట్టింది. వేంకటేశ్వరస్వామి తన మొక్కును తీర్చాడట.

రాను రాను తను తనకు తెలియకుండానే జానకి ఆధీనంలోకి పోయాడు. ఏ చిన్నపనైనా జానకితో సలహా సంప్రదింపులు చేసేవాడు.

'ఏమిటండీ ఆలోచిస్తున్నారు'? జానకమ్మ అడిగింది.

'ఆఁ! ఏమీలేదూ...నాకూ ఒక కల యిటువంటిదే వస్తేను.'

'ఏమీకా!' గుర్రుపెట్టి నిద్రపోతారు కదండీ.'

రాజశేఖరానికి నవ్వు వచ్చింది.

'అయినా కలలకు భయమున్నట్లు లేదు.'

ఆ నవ్వుకు జానకమ్మకు కొంచెం కోపం వచ్చింది.

'ఆ కలయేమిటో చెప్పరాదూ' నిష్ఠూరంగా అని విషయాన్ని మార్చింది.

'ఏమిటో జానకి. అది ఒక రకమైన పీడకలే. కాని నా కలలో వచ్చింది మనుష్యులుకాదు. పక్షులు.'

'పక్షులా!'... అన్నది.

'అదే గమ్మత్తు. మన దొడ్డిలో చెట్టుమీద రెండు పక్షులున్నయ్యంట.'

'సరే అవీ మన దొడ్లో వేనా?'

'అవును. అవి యింకో దొడ్లోనైతే నా కలలోకి ఎలా వస్తయ్'?

'బాగానే ఉన్నది.'

'అవి చాలా అన్యోన్యంగా ఉంటూ ఉండేవి. ఆడ పక్షి గుడ్లు పెట్టి పిల్లల్ని చేసింది. కాని వాటికి మిగిలింది, ఒకే ఒక్కపిల్ల. ఆ ఒక్కపిల్లకి రోజూ ఒకటి గూటిలో ఉంటే మరొకటి బయటికి వెళ్లి



తిండి తీసుకొచ్చి పెడుతూ ఉండేవి. సాయంకాల మయ్యేటప్పటికి ఆడుకొంటున్నాయ్యా అన్నట్లు కిలా కిలా రవాలు చేసేవి. కాని వాటి సంతోషం అట్టే కాలం నిల్వ లేదు. ఒకనాడు యముడులాంటి వేటకాడు మగ పక్షిని కొట్టాడు. అది కిలా కిలా తన్నుకుంటూ క్రిందపడి చచ్చిపోయింది. పిల్లా తల్లి ఎంతగానో విల విల్లాడి పోయినవి.

'పాపం' అన్నది జానకమ్మ.

'అయినా అంత దుఃఖాన్ని దిగ్రమింగి ఆ తల్లిపక్షి ఆ బిడ్డను సాకింది. ఎప్పుడు తిండికోసం బయటకెళ్లేదో ఎప్పుడొచ్చేదో తెలిసేది గాదు. ఆ పిల్ల కోసమే తమ బ్రతుకుతున్నట్లు దాన్ని పెంచింది.'

'మరి తల్లి ప్రేమ ఏమనుకున్నారూ! మనిషి కైనా పశుపక్ష్యాదులకైనా తల్లికి బిడ్డ మీద అలాగే ఉంటుంది' స్వానుభవంతో చెప్పుతున్నంత ధీమగా అన్నది జానకమ్మ.

'ఔను. మాతృ ప్రేమ ఔన్నత్యాన్ని కొలవ టము కష్టమే. వత్తాసు పలికాడు రాజశేఖరం.

'తర్వాత ఏం జరిగిందండీ?' అడిగింది మళ్లీ.

'ఆ పిల్ల పెద్దదయింది. తల్లేమో ముసలిదై పోయిందె. ఆహారం తీసుకొనిరావటం పిల్ల వంతయింది. పిల్ల కూడా అమ్మ మీదున్న ప్రేమ కొద్దీ రోజూ తిండి తీసుకొచ్చిపెడుతూ ఉండేది. ఇలా కొంతకాలం జరిగిపోయింది. ఉన్నట్లుండి ఒక రోజున మరొక పక్షిని తీసుకొచ్చింది బిడ్డ. అది దాని భార్య. తల్లి చాలా సంతోషపడింది మొదట. కాని కొన్ని రోజులు గడచిన తర్వాత తగాదాలు ప్రారంభమైనవి. తల్లి రోజూ గొణుక్కోవటం మొదలెట్టింది. సూటీ పోటీగా బిడ్డ తీసుకొచ్చిన దానిని దెప్పి పొడవటం సాగిం చింది. బిడ్డ వెర్రిబాగులవాడై పోయి దాని చేతిలో కీలుబొమ్మ అయి పోయాడని వాపోయింది. తనను చూడటం లేదని తన మాటంటే ఖాతరే లేదని ఏడ్చింది. కోడలు పక్షి కూడ విసుక్కోవటం మొద లెట్టింది. మొగుడు తన వాడైతే నీ పనేమిటిలే అన్నట్లు ప్రవర్తించేది.

'రైటే. పెళ్లాం తియ్యనని ఊరికినే అన్నారా?' అందుకొన్నది జానకమ్మ.

'పెళ్లాం తియ్యగానే ఉంటుంది వయస్సులో. అదే చేసింది ఆ బిడ్డ కూడ. ఆడదాని ఆకర్షణలో పడి పోయింది. ఆ పరస్పర ఆకర్షణ ద్వారా ఆ రెండూ అన్యోన్యంగా అనురాగాలు పెంచుకొన్నవి. విడదీయరాని జంటగా అల్లుకు పోయినవి. అందుకనే తల్లీ పెళ్లాం మధ్య తగాదాలు వచ్చినపుడు ఎటూ తేల్చలేని సంకటా వస్థలో పడిపోతూ ఉండేది. అటు తల్లి మీదున్న ప్రేమా అనురాగాలు చేత ఆమెది తప్పయినా తప్పని అనలేక పొయ్యేది; ఏదో చెప్పాలని, సర్దుబాటు చెయ్యా లని తప్పు చేసిన వారిని—అటు తల్లయినా, యిటు భార్య అయినా గట్టిగా చివాట్లు పెట్టాలని అనేకసార్లు అను కొనేది. కాని అనుకొన్న వాటిని ఆచరణలో పెద్ద మనోబలం లేకపోయేది. అలాగే అన్నింటిని మనసులో అణచుకొనేది.

ఇక అటుతల్లి ఒక రోదన. పెళ్లాం బెల్లమై పోయింది. తల్లి విషమై పోయిందని ఒకటే గొడవచేసేది.

'అవును పాపం. అడ్డాలు నాడు బిడ్డలుగాని కడ్డాలు నాడు బిడ్డలా యేమిటి'? శ్రుతి కలిపింది జానకమ్మ.

'నిజమే. పోనీ ఆ బిడ్డ భార్యయైనా భర్త కష్టాలు తెల్సు కాబట్టి సర్దుకుపోదామన్న ధ్యాసే ఉండేది గాదు. తన సుఖమేమో తనేకాని తన భర్త మనోవేదన్ని అర్థం చేసుకో లేదు. కాని మిగతా విష రాల్లో భర్తకు అన్నివిధాలా సహాయకారిగా ఉండేది. ఒకప్రక్క భర్తను ప్రేమిస్తూనే ఉండేది, మరో ప్రక్క ఆ భర్త తల్లిని సాధిస్తూ ఉండేది.

పాపం ఆ తల్లి అలాగే విలపిస్తూ కొంత కాలానికి చనిపోయింది.'

ఎంతో బరువుగా నిట్టూరుస్తూ యిదీ కథ అన్నట్లు ఆపేశాడు.

జానకమ్మ యీసారి యెలా సమరిస్తుందో నని చూశాడు. కాని జానకమ్మ పమిటి చెంగుతో కళ్లు తుడుచుకొనటం గమనించాడు.

రాజశేఖరం కూడా యేమీ అనలేకపోయాడు. అడగలేక పోయాడు.

ఏమంటాడు?

ఇప్పుడు తన కొడు కెంతో—అప్పుడూ తనూ అంతే.

ఇప్పుడు తన కోడ లెంతో—అప్పుడు తనభార్య అంతే.

ఇప్పుడు తన భార్య యెంతో—అప్పుడు తన తల్లీ అంతే.

ఇది తరతరాల కథ.